క్లుప్తంగా

డ్రైనేజీ పనుల పరిశీలన



బాన్సువాడ: బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని ఎల్లయ్య చెరువు వద్ద రూ.50 లక్షలతో సీసీ డ్రైనేజీ పనులు పూర్తి చేశామని మున్సిపల్ చైర్మన్ గంగాధర్ అన్నారు. ఆదివారం ఆయన బీఆర్ఎస్ నాయకులతో కలిసి పనులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. డ్రైనేజీ నిర్మాణం వల్ల మురికి నీరు నిల్వ ఉండదని, దుర్వాసన వచ్చే అవకాశం ఉండదన్నారు. ఆయన వెంట నాయకులు కనుకుట్ల రాజు, దాసరి గంగాధర్, యూనుస్, బిట్ల రమేశ్ ఉన్నారు.

గృహలక్ష్మి ప్రొసీడింగ్ కాపీల పంపిణీ



పిట్లం(జుక్కల్): సిద్ధాపూర్‌తండాలో ఆదివారం గృహలక్ష్మి లబ్ధిదారులకు ప్రొసెడింగ్ కాపీలను బీఆర్ఎస్ నేతలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ హన్మంత్‌రావు, వార్డు సభ్యులు జగ్గురాం, పండరి పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు..



పెద్దకొడప్‌గల్(జుక్కల్): ఆడబిడ్డలకు కట్నంగా కల్యాణ లక్ష్మి పథకం ఇస్తున్న కేసీఆర్‌ను అందరూ ఆశీర్వదించాలని సర్పంచ్ విఠల్ కోరారు. ఆదివారం కాటేపల్లి గ్రామంలో ఏడుగురికి కల్యాణ లక్ష్మి చెక్కులను ప్రజా ప్రతినిధులు పంపిణీ చేశారు. ఉప సర్పంచ్ జానుపటేల్, నాయకులు సాయగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

షాదీముబారక్ చెక్కులు..



నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలం హంగర్గలో ఆదివారం పలువురు లబ్ధిదారులకు షాదీ ముబారక్ చెక్కులను బీఆర్ఎస్ నాయకులు అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు నీలుపటేల్, శివానంధ్ పటేల్, సాయాగౌడ్, గంగాధర్ తదితరులున్నారు.

బతుకమ్మ చీరలు..



బాన్సువాడ రూరల్: బోర్లం క్యాంపు గ్రామ పంచాయతీలో బతుకమ్మ చీరలను మహిళలకు ఎంపీటీసీ యశోద రతన్‌తో కలిసి బోర్లం క్యాంపు సర్పంచ్ నాన్కుబాయి పీర్యానాయక్ పంపిణీ చేశారు. బతుకమ్మ పండుగను ప్రతి ఒక్కరు సంతోషంగా జరుపుకోవాలన్నారు. వార్డు సభ్యులు, బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

కేసీఆర్ కిట్లు..



తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో ఆదివారం యువకులు, క్రీడాకారులకు కేసీఆర్ కిట్లను ప్రజాప్రతినిధులు, అధికారులు పంపిణీ చేశారు. అలాగే మహిళలకు బతుకమ్మ చీరలను కూడా అందించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

'పది' అనుకుంటే పప్పులో కాలేసినట్లే!





రామారెడ్డి (ఎల్లారెడ్డి): మార్కెట్లో ఇప్పటికే నామాత్రంగా రూ.10 కాయిన్ అక్కడక్కడా వినియోగంలో ఉంది. కొన్నిచోట్ల మాత్రమే రూ.10 కాయిన్ చెల్లుబాటవుతోంది. దుకాణాలలో ఇస్తే అవగాహన లేక చాలా మంది తీసుకోవడానికి నిరాకరిస్తున్నారు. దీనికి తోడు మార్కెట్లో కొత్తగా రూ.20 కాయిన్ అందుబాటులోకి రావడంతో రెండింటి మధ్య తేడా గుర్తించలేక సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారు. రూ.10 కాయిన్ అనుకొని 20 రూపాయల కాయిన్‌తో క్రయవిక్రయాలు కొనసాగిస్తున్నారు. చదువుకున్న వారు సైతం 20 రూపాయల కాయిన్ గుర్తించలేకపోతున్నారు.

పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తం

- ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం.. స్వైర విహారం చేస్తున్న పందులు
- జాడ లేని ఫాగింగ్... దోమల బెడదతో అనారోగ్యానికి గురవుతున్న ప్రజలు



పిట్లం నేతాజీనగర్ కాలనీలో పేరుకుపోయిన చెత్తాచెదారం, తిరుగుతున్న పందులు(వృత్తంలో)

పిట్లం(జుక్కల్): పిట్లం గ్రామ పంచాయతీ పరిధిలోని పలు కాలనీలలో కార్మికులు చెత్తను సేకరించి డంపింగ్‌యార్డ్, కంపోస్ట్ షెడ్‌కు తరలించకుండా చెత్తనంతా కాలనీలోని ఒక దగ్గర పారబోస్తున్నారు. పారబోసిన చెత్త వద్ద పందులు తిరుగుతూ స్వైర విహారం చేస్తున్నాయి. జనావాసాలకు సమీపంలో చెత్తను పారబోయడంతో దుర్వాసన వస్తోంది. చెత్తపై వాలిన ఈగలు, దోమలు ఇళ్లలోకి వచ్చి ఆహార పదార్థాలపై వాలుతున్నాయి. దీంతో అనారోగ్యానికి గురవుతున్నామని ప్రజలు వాపోతున్నారు. స్వచ్ఛ భారత్ రిక్షాలు, ట్రాక్టర్లతో చెత్తను సేకరించడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. దీనికి తోడు పిట్లం గ్రామ పంచాయతీ పరిధిలోని పలు కాలనీలలో మురికి కాలువలు నిర్మించకపోవడం వల్ల రోడ్లపై మురికి ప్రవహిస్తోంది. మురికి నీరంతా ఒకే దగ్గరికి చేరి నీళ్లు నిల్వ ఉంటున్నాయి. దీంతో దోమల బెడద కూడా ఎక్కువైందని స్థానికులు చెబుతున్నారు. దోమల వల్ల చాలా మంది డెంగీ, మలేరియా, టైఫాయిడ్, తదితర జ్వరాల బారిన పడి ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు ఇచ్చిన ఫాగింగ్ మెషిన్లు మూలన పడ్డాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజలు అనారోగ్యాల బారిన పడకుండా కాలనీలలో చెత్త, మురికి నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని, దోమల బెడద లేకుండా ఫాగింగ్ చేయాలని ప్రజలు కోరుతున్నారు.



పిట్లంలో ఇంటి వద్ద నిల్వ ఉన్న మురికి నీరు



పిట్లం ఇస్లాంపురా కాలనీలో మురికి కాలువలు లేక నిలిచిన మురికినీరు

దోమల బెడద ఎక్కువైంది



మా కాలనీలో మురికి కాలువలు నిర్మించక పోవడం వల్ల మురికి నిల్వ ఉంటోంది. దీని వల్ల దోమల బెడద ఎక్కువైంది. సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్నాయి. అధికారులు స్పందించి మురికి కాలువలు నిర్మించి మురికి నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపడితే బాగుంటుంది. – హన్మాండ్లు, శాంతినగర్, పిట్లం

చెత్త సేకరణ చేయడం లేదు



మా కాలనీలో చెత్తను సేకరించ పోవడం వల్ల కాలనీలో ని ఓ చోట చెత్తా చెదారం పేరుకుపోయింది. చెత్తలో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. సంబంధిత అధికారులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. అధికారులు సమస్య పరిష్కరిస్తే బాగుంటుంది. – అశోక్‌రాజ్, నేతాజీనగర్, పిట్లం

కార్యకర్తలు అసత్య వార్తలను నమ్మొద్దు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత జనార్దన్‌రెడ్డి

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ టికెట్‌ను మదన్ మోహన్‌కు కేటాయిస్తూ ఓ ప్రధాన పత్రికలో వచ్చిన వార్త అవాస్తవమని, కాంగ్రెస్ పార్టీ, టికెట్లను ఎవరికీ కేటాయించలేదని ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి అన్నారు. ఆదివారం ఎల్లారెడ్డిలో ఆయన మాట్లాడుతూ.. 62 మందికి టిక్కెట్లు ఖరారైనట్లు ఓ పత్రికలో తప్పుడు వార్త ఇచ్చారని అన్నారు. తెలంగాణలో ఇంత వరకు ఎవరికి కాంగ్రెస్ పార్టీ టికెట్లు ఖరారు చేయకముందే తప్పుడు వార్తలు రాయడం సరికాదన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు గందరగోళానికి గురికావద్దన్నారు. ఇటీవల కామారెడ్డిలో నిర్వహించిన బీఆర్ఎస్ సభలో మంత్రి కేటీఆర్, వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి పట్ల పలికిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలన్నారు. జిల్లా కిసాన్‌సెల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు అఫీజ్, కాశీరాం, యూనుస్, ధనంజయ్, గోవింద్ ఉన్నారు.

అంబారీపేటలో దళితుల ఆందోళన



అంబారీపేటలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దళితులు

దోమకొండ: అంబారీపేటలో దళితులు ఆదివారం ధర్నా నిర్వహించారు. అనంతరం సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. దళితులు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం అర్హులైన వారికి దళిత బంధు మంజూరు చేయడం లేదని ఆరోపించారు. కేటీఆర్ నాయనమ్మ గ్రామం కోనాపూర్‌లో 120 కుటుంబాలకు దళిత బంధు కేటాయించారని, అంబారీపేటలో కూడా 201 కుటుంబాలకు దళిత బంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

గ్రామసభల ద్వారా ఎంపిక చేయాలి

భిక్కనూరు: గ్రామసభలు ఏర్పాటు చేసి దళితబంధు, గృహలక్ష్మి లబ్ధిదారులను ఎంపిక చేయాలని కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల కన్వీనర్ తుడుం జీవన్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన భిక్కనూరులో మాట్లాడారు. బీఆర్ఎస్ నేతలు తమ కార్యకర్తలకే ప్రభుత్వ పథకాలను తమ సొంత డబ్బులుగా భావించి అందిస్తున్నారని, ఇది ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.

కాంటింజెంట్ వర్కర్ల ఆధ్వర్యంలో నేడు చలో హైదరాబాద్



మాట్లాడుతున్న సిద్ధిరాములు

కామారెడ్డి టౌన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పని చేస్తున్న కాంటింజెంట్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 9న(నేడు) చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బీఎల్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.సిద్ధిరాములు తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడారు. 30 ఏళ్లుగా పని చేస్తున్న కాంటిజన్స్ వర్కర్లకు రూ.2 వేల వేతనం మాత్రమే ఇస్తున్నారని, కనీసం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. యూనియన్ నాయకులు భాస్కర్, రవి, రాజమణి పాల్గొన్నారు.

గ్రామాలాభివృద్ధి కేసీఆర్ ఘనతే

- మరోసారి ఆశీర్వదించండి
- ఎమ్మెల్యే జాజాల సురేందర్
- రూ.14.65 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సురేందర్

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పలు గ్రామాల్లో రూ.14.65 కోట్లతో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే జాజాల సురేందర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల రూపురేఖలు మార్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కిందన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా గ్రామాలకు మౌలిక వసతులు కల్పించలేకపోయారని అన్నారు. ఐదు సంవత్సరాలుగా నియోజకవర్గంలో 60 ఏళ్లలో చేయని అభివృద్ధిని చేసి చూపించినట్లు పేర్కొన్నారు. తాను చేసిన అభివృద్ధి పనులను చూసి తిరిగి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మరోసారి మండల ప్రజలు ఆశీర్వదించి గెలిపించాలన్నారు. ప్రజలకు సేవకుడిగా పనిచేస్తానన్నారు. జెడ్పీటీసీ శ్రీలత, ఎంపీపీ గరీబున్నిసాబేగం, మండల పార్టీ అధ్యక్షుడు దివిటి రమేశ్, సర్పంచులు బొల్లు లావణ్య పాల్గొన్నారు.

వడ్డెరలను ప్రభుత్వం ఆదుకుంటుంది

ఎల్లారెడ్డి: శ్రమ దోపిడీకి గురవుతున్న వడ్డెరలను ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. ఆదివారం ఎల్లారెడ్డి పట్టణంలోని ముత్యపు రాఘవులు ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన వడ్డెరల ఆత్మగౌరవ సభకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వడ్డెర ఆత్మగౌరవ భవన సముదాయ ట్రస్టు చైర్మన్, వైస్ చైర్మన్ జెరిపెటి సత్యనారాయణ, ఎత్తరి అంతయ్య, వడ్డెర సంఘం ఎల్లారెడ్డి మండల అధ్యక్షుడు నర్సింలు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిలో వడ్డెరల ఆత్మగౌరవ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): పట్టణంలోని ఎర్రమన్నుకుచ్చకాలనీకి చెందిన అల్లం రాములు ఇటీవల ఆత్మహత్య చేసుకుని మృతి చెందడంతో ఆయన కుటుంబానికి ఎమ్మెల్యే ఆదివారం ఆర్థిక సాయాన్ని అందించారు. ఎమ్మెల్యే పంపిన నగదును మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, కౌన్సిలర్ శ్రీనివాస్‌లు మృతుడి భార్యకు అందించారు.

నేడు సదాశివనగర్‌కు ఎమ్మెల్యే రాక

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి సోమవారం ఎమ్మెల్యే సురేందర్ రానున్నట్లు సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా నూతన గ్రామ పంచాయతీ భవనానికి శంకుస్థాపన, అలాగే కొత్త చెరువు– పాత చెరువుకు వెళ్లే ప్రధాన కాలువ మరమ్మతు పనులను, మార్కెట్ కమిటీ కార్యాలయాన్ని ప్రారంభిస్తారన్నారు.

రైతు బీమా కాపీ అందజేత



పిట్లంలో రైతు బీమా ప్రొసీడింగ్ కాపీని అందజేస్తున్న బీఆర్ఎస్ నేత విజయ్

పిట్లం(జుక్కల్): మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారురాలికి రూ.5లక్షల రైతు బీమా ప్రొసీడింగ్ కాపీలను మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు విజయ్ అందజేశారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ.. రాంపూర్ గ్రామానికి చెందిన బట్టు ముత్యం రెడ్డి, అంజయ్య అనే రైతులు ఇటీవల మృతి చెందడంతో వారికి నామినీలైన బట్టు లక్ష్మి, లలితలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల రైతు బీమా ప్రొసీడింగ్ కాపీలను అందజేశామన్నారు. సర్పంచ్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గౌరీ శంకర ఆలయంలో భూమి పూజ

కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని దేవునిపల్లి విద్యుత్, గాయత్రీనగర్ శ్రీగౌరీ శంకర ఆలయంలో ఈనెల 9న సోమవారం ఉదయం 7 గంటలకు వీరాంజనేయ స్వామి విగ్రహం, నవ గ్రహాల ఏర్పాటు, ప్రహరీ నిర్మాణాలకు భూమిపూజ నిర్వహించనున్నట్లు ఆలయ ప్రతినిధులు తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

శనగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

రాజంపేట: రాజంపేట సొసైటీ, ఆర్గొండ సొసైటీ పరిధులలో శనగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని సీఈవోలు వెంకటేశ్వర శర్మ(రాజంపేట), సాయిలు(ఆర్గొండ) ఆదివారం తెలిపారు. యాసంగి పంటకు రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. 25 కేజీల బస్తా రూ.1875లకు లభిస్తుందని వారు పేర్కొన్నారు.

కొనసాగుతున్న ఆశావర్కర్ల నిరసనలు

రాజంపేట: రాజంపేటలో ఆశా వర్కర్ల సమ్మె కొనసాగుతోంది. ఆదివారం రాజంపేటలో ఆశావర్కర్లు ఆదివారం వంటావార్పు చేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.18 వేల చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చే వరకు సమ్మె విరమించబోమని స్పష్టం చేశారు.

సెంట్రల్ లైటింగ్, రోడ్డు పనులు ప్రారంభం



మద్నూర్‌లో పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ సురేశ్

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్, రోడ్డు వెడల్పు పనులను ఆదివారం సర్పంచ్ సురేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇళ్లు, దుకాణాలు కోల్పోతున్న బాధితులను ఆదుకుంటామని, అభివృద్ధి పనులకు విఘాతం కలగకుండా అధికారులకు ప్రజలు సహకరించాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు పాకాల విజయ్, హన్మాండ్లు, విఠల్ పాల్గొన్నారు.

జుక్కల్‌లో..



జుక్కల్‌లో సెంట్రల్ లైటింగ్ పనులు ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నిజాంసాగర్(జుక్కల్): మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్ పనులకు ఆదివారం బీఆర్ఎస్ నాయకులు భూమిపూజ నిర్వహించారు. 500 మీటర్ల మేరకు సెంట్రల్ లైటింగ్ కోసం ప్రభుత్వం రూ.4.5 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్ పనులకు శ్రీకారం చుట్టారు. నాయకులు దాదారావ్ పటేల్, శివానంద్, సాయగౌడ్, గంగాధర్, తదితరులు ఉన్నారు.

కందపల్లిలో జీపీ భవనం..

బిచ్కుంద(జుక్కల్): కందర్‌పల్లిలో గ్రామ పంచాయతీ భవనాన్ని, బిచ్కుందలో కొత్తగా నిర్మించిన బసవన్న గుడిని ఆదివారం ఎంపీపీ అశోక్ పటేల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నాగ్‌నాథ్ పటేల్, సర్పంచ్ గంగారాం, బీఆర్ఎస్ నాయకులు నాల్చర్ రాజు, యాదవరావు, వెంకట్‌రావు పాల్గొన్నారు.

బిచ్కుందలో గ్రంథాలయ భవనం..



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న చైర్మన్ రాజేశ్వర్

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని ఆదివారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్న రాజేశ్వర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ప్రతి ఒక్కరూ పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. ఎంపీపీ అశోక్, ఏఎంసీ చైర్మన్ నాగ్‌నాథ్ పటేల్, తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గాల ఎన్నిక

■ **కురుమ యువ చైతన్య సమితి..**



భిక్కనూరు: ఇసన్నపల్లి గ్రామ కురుమ యువ చైతన్య సమితిని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కదారి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా కడబోయిన సాగర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నర్సింలు, ప్రధాన కార్యదర్శిగా రాములు, కోశాధికారిగా కంపే ఎల్లేష్, ప్రచార కార్యదర్శిగా కనకరాజు, కార్యదర్శులుగా మహేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు మామిడి సంజీవ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పెద్దోళ్ల మహేష్, తదితరులు పాల్గొన్నారు.

■ **బస్వాపూర్ ముదిరాజ్ సంఘం..**

భిక్కనూరు: బస్వాపూర్ ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పోచమైన పెద్ద నారాయణ, ఉపాధ్యక్షుడిగా మద్ది పెంటయ్య, ప్రధాన కార్యదర్శిగా మర్కంటి బాల్‌రాజ్, కోశాధికారిగా గంధ రాంచంద్రం, సలహాదారులుగా మద్ది మల్లయ్య, పోచమైన స్వామి, గంగాధర్, శంకర్, జంగం నరేందర్‌లు ఎన్నికయ్యారు. మత్స్య సహకార సంఘం అధ్యక్షుడిగా పోచమైన రాజయ్య, ఉపాధ్యక్షుడిగా మర్కంటి నారాయణ, ప్రధాన కార్యదర్శి దాకి క్రిష్ణ, తదితరులు ఎన్నికయ్యారు.

■ **ఎలక్ట్రీషియన్ అసోసియేషన్..**



కామారెడ్డి టౌన్: కామారెడ్డి ఎలక్ట్రీషియన్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం జిల్లా కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్రీగాధ రమేష్, ప్రధాన కార్యదర్శిగా యూనిస్, కోశాధికారిగా యు.భాస్కర్‌రావు, కార్యవర్గ సభ్యులుగా హబీబ్‌ఖాన్, ఖదీర్, తదితరులను ఎన్నుకున్నారు.

■ **భవాని నగర్ కాలనీ..**

కామారెడ్డి టౌన్: పట్టణంలోని భవానినగర్ కాలనీ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చింతల మల్లేష్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా భరిడే అనుదీప్, కార్యవర్గ సభ్యులుగా ప్రవీణ్, సురేందర్, నాగరాజు, రవీందర్ గుప్తా, రాజ్ కుమార్, దయాకర్, రామరాజులను ఎన్నుకున్నారు.



మల్లేశ్ యాదవ్

■ **రెడ్డి సంఘం అధ్యక్షుడిగా నర్సారెడ్డి**



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో ఆదివారం రెడ్డి సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా బుడిగె నర్సారెడ్డి, కార్యదర్శిగా నారెడ్డి విఠల్ రెడ్డి, కోశాధికారిగా కోతి రఘుపతి రెడ్డి, ఉపాధ్యక్షుడిగా కుంట సుదర్శన్ రెడ్డి, గాదారి లచ్చిరెడ్డి, దొడగిరి బాల్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా కొప్పుల బాల్‌రెడ్డి, లింగారెడ్డి, కార్యవర్గ సభ్యులుగా జైపాల్‌రెడ్డి, రాజిరెడ్డి, నిర్జయ్‌తేజ, విఠల్‌రెడ్డిలను ఎన్నుకున్నారు. రెడ్ల ఐక్యతకు కృషి చేస్తానని నర్సారెడ్డి అన్నారు.

నిధులు మంజూరు చేయండి



ప్రభుత్వ విప్‌తో దేవునిపల్లి వీడీసీ ప్రతినిధులు

కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని దేవునిపల్లి గ్రామాభివృద్ధి సంఘం(వీడీసీ) ఆధ్వర్యంలో నిర్మిస్తున్న మల్లన్న దేవాలయం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ప్రభుత్వ నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌ను ఆదివారం వీడీసీ ప్రతినిధులు కలిసి విజ్ఞప్తి చేశారు. ఆలయం కమ్యూనిటీ హాల్, ఇతర పనులు రూ.60 లక్షల వ్యయంతో చేపట్టినందున ప్రభుత్వ సహకారం అందించాలని ప్రభుత్వ విప్‌ను కోరారు. వీడీసీ అధ్యక్షుడు మర్కంటి స్వామి, ప్రధాన కార్యదర్శి ద్యావరి నవీన్, ప్రతినిధులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు ఎంప్లాయీస్ అసోసియేషన్ వినతి

కామారెడ్డి అర్బన్: మున్నూరుకాపు ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగుల కోసం భవన నిర్మాణానికి స్థలం, నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ద్వారా మంత్రి కేటీఆర్‌కు విజ్ఞప్తి చేసినట్లు మున్నూరుకాపు ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా ప్రతినిధులు తెలిపారు. సహకారం అందించడానికి మంత్రి కేటీఆర్ సానుకూలంగా ఉన్నారని ప్రభుత్వ విప్ పేర్కొన్నట్లు అసోసియేషన్ ప్రతినిధులు అన్నారు.

నీకు అండగా నేనుంటా

బీబీపేట: నీకు అండగా నేనుంటా అంటూ కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్ బీబీపేట ఉపసర్పంచ్ సాయినాథ్‌కు ధైర్యం చెప్పారు. ఇటీవల ఉపసర్పంచ్ సాయినాథ్ కాంట్రాక్టు చేసిన బిల్లులు రావడం లేదని, ఆత్మహత్య చేసుకుంటా అంటూ మీడియాలో వైరల్ అయిన విషయం తెలిసిందే. దీంతో ఆదివారం గంప గోవర్ధన్, సాయినాథ్ ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. వీలైనంత త్వరగా బిల్లులు వచ్చేలా చూస్తానని చెప్పారు.

ఎస్టీలకు అన్యాయం చేయొద్దు



కామారెడ్డి క్రైం: లబానాలను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరుతూ జరుగుతున్న కార్యక్రమాలను నిరసిస్తూ ఆదివారం అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి గిరిజన సంఘాల ప్రతినిధులు కామారెడ్డిలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లబనాలను ఎస్టీలలో కలపాలంటూ లబానా రాష్ట్ర సంఘం అధ్యక్షుడు తాన్‌సింగ్ చేస్తున్న కార్యక్రమాలు తన సొంత లాభం, రాజకీయ లబ్ధి కోసమేనని ఆరోపించారు. వారిని ఎస్టీ జాబితాలోకి తీసుకువస్తే గిరిజనులకు అన్యాయం జరుగుతుందన్నారు. అలా జరగకుండా చూడాలని, ఎస్టీలకు న్యాయం చేయాలని స్పీకర్‌కు విన్నవించారు. ఇందుకు స్పీకర్ పోచారం సైతం సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. గిరిజన సంఘాల ప్రతినిధులు తేజావత్ మహేందర్, రాథోడ్ దేవిసింగ్ పాల్గొన్నారు.